దెబ్బతో దెయ్యం

"సుబ్బులు తాతా! ఒక కథ సెప్పవూ'' అన్నాడు ఆరేళ్ళ వెంకిగాడు, నోట్లో వేలేసుగుని.

అది గజపతినగరం. చంపావతి యేరు దానిపొడుగునా గలగల ప్రవహిస్తూంది. వెంకటాపురం రేవు కెదురుగా వొకపెద్ద మఱ్ఱి చెట్టుంది. వేసవి సాయంత్రాలలో చల్ల గాలికి ఆ చెట్టుకింద సుబ్బులుతాత చింకి చాప పరుచుకుకూచునేవాడు.

ఆవేళ రోజూమాదిరిగా పది మంది పన్నెండేళ్లలోపు ఆడ,మగ, నత్త. నావ, అతనిచుట్టూ చేరేరు. పుటికలమ్మే కోమటికొడుకు వెంకటరెడ్డి, మంచినీళ్ళ రామయ్య కూతురు లక్ష్మి, మునసబుకొడుకు సుబ్బన్న, మేజస్ట్రేటు కచేరీ హెడ్ గుమాస్తాకొడుకు చిరంజీవి, యాత పైడితల్లికొడుకు వెంకిగాడు యిత్యాదులు సుబ్బులుతాత ఆటవిడుపు పరివారం.

'అయితే యిలా దగ్గరసా జరిగి కడియంకట్టి కూచోండి, మంచికథ చెపతా...'

పిల్లలు దగ్గరగా జరిగారు. 'ఏంకథ చెప్పమన్నారు?' అంతా గొల్లుమని పురమాయించేరు. చంద్రుడింకా అగుపించడంలేదు. కానీ, ఆకాశపు వెలుతురుకు యేటి పొడియిసక మెరుస్తూంది.

'ఆగండాగండి. మీ రెవ్వరూ అడిగిందికాదు. ఒక మంచి గమ్మత్తయినకథ చెపుతా'

అంతా నిశ్శబ్దం. ఆతృతగా చూస్తున్నారు. సుబ్బులు తాత కాలం మళ్ళినవాడు. అనుభవంకల వాడు. చెట్టుకింద ప్లీడరీచేసి జీవిత మంతా బ్రహ్మచారిగా గడిపిన వాడు. పిల్లలు కథ చెప్పమన్నప్పుడు, తనజీవితంలోతగిలిన యేదో అనుభవాన్నే కథలాఅల్లి చెప్పేవాడు.

'దెయ్యాలపంతులు కథ చెప్పనా?' అన్నాడు. దిశెమొలతోవున్న వెంకిగాడు సగంలేచి 'ఓలమ్మో' అన్నాడు భయంతో బిక్కచచ్చి.

'ఫరవాలేదురా వెంకిగా. ఈ కథలో దెయ్యాలు రావురా. వెంకిగాడు గొంతికిలా కూచున్నాడు గుండె కొంచెం సర్దుకుందిగాని, అలాగే జరిగిజరిగి తాతను తాకినంత దగ్గరగా చేరేడు.

'ఏమ్రోయ్! కథ బాగా విని 'ఊ' కొట్టాలి.' అంతా అలాగే అన్నారు.

'పదేళ్లకిందట యీ మఱ్ఱిచెట్టు పక్కవున్న యింట్లో వీరప్పరాజుఅని వొక దెయ్యాలపంతులుండేవాడు.'

'అంతే యేటండీ తాతా?' అని ప్రశ్నించేడు పదేళ్ల కోమటి వెంకట రెడ్డి.

'అంటే-యెవరికైనా దెయ్యాలు పడితే కుదురుస్తాడన్నమాట'

'ఓలమ్మో. దెయ్యాలే!' వెంకటరెడ్డి హడిలి తాతదగ్గరగా చేరేడు.

'ఓరి...పిరికీ! తాతని చెప్పనీరా' అన్నాడు మునసబుకొడుకు సుబ్బన్న.

'ఆ వీరప్పరాజు దెయ్యాలు కుదురుస్తానవేవాడు. మంత్రాలు లేవూ, మన్నూ లేవూ. తను మాత్రం దెయ్యంలాగే వుండేవాడు.'

'తాతగారూ! దెయ్యాలెలాగుంటాయండీ' అని ప్రశ్నించేడు చిరంజీవి.

'దెయ్యాలెలావుంటాయేమిటి నాయనా? అసలు దెయ్యాలంటూ వుంటేగా! మనిషిలో వున్న భయమే దెయ్యం. ఆ భయంతో దేన్నిచూసినా దెయ్యమే అనిపిస్తుంది. వికృతంగా వున్నవాడిని దెయ్యం అనమూ మనం? అంతే. సరే-యిక కథ వినండి."

"వాడి దేవుడిగదిలో పెద్దపెద్ద భయంకరమైన పటాలు, రెండు మనిషి పుఱ్ఱెలు, యింకా యేవేవో వెఱ్ఱివెఱ్ఱి విగ్రహాలు, ఒక పెద్దకత్తీ వుండేవి. వాడు తెల్లవారుఝామున నాలుగుగంటలకల్లా స్నానంచేసి, గంటన్నరసేపు 'హ్రీం, క్రీం, హ్రూం, ఫట్' అంటూ అరుస్తూ యేదో జపం చేసేవాడు.'

'అయితే తాతా...ఆ డెలాగుండేవోడు?' తిరిగి ప్రశ్నించేడు వెంకటరెడ్డి.

'ఓలూరుకోగా...పిరికీ! నీ కన్నీ అనమానాలే. సెపితే ఎంకలు కొడతావు...' సుబ్బన్న వెక్కిరించేడు.

'వాడి సేడిపించకు రా సుబ్బిగా...

శ్రీ అంగర వెంకటకృష్ణారావు

నేను చెపుతాగా...నల్లగా, యెత్తుగా, పోతులా వుండేవాడు. మొక్కజొన్నపొత్తుమీది పీచులాంటి చింపిరిజుత్తు, భోగిమంటల్లాగ ఎఱ్ఱటి కళ్లు, యింతకో పెదిమా, అంతకో పన్నూ...'

ఈ వర్ణనకి కొందరు హుషారెక్కేరు. కొందరు హడిలేరు. వెంకటరెడ్డి పళ్లు బిగుసుకున్నాయి.

'ఆ వీరప్పరాజు యెవ్వరినీ లక్ష్యపెట్టేవాడు కాదు. బీదవాళ్ళనీ, పిరికివాళ్లనీ జడిపించి వాళ్లదగ్గర డబ్బు నిర్దయగా గుంజేవాడు. ప్రయోగాలు చేసి ప్రాణంతీస్తానని బెదిరించేవాడు...'

'తాతా! తెలవకడుగుతాను. పయోగాలంటే యేటి?' మళ్లీ ప్రశ్నించేడు వెంకటరెడ్డి. సుబ్బన్నకి రిమ్మెత్తుకొచ్చింది. 'ఈ. .పిరికినా యాలకి చండేగాలు నావు. గుండెల్లో సూత్తే గుబులుగుబులు. పల్లకుండనేడు...'

'తిట్టకురా సుబ్బిగా. వాడి కనుమానంకలిగితే నేను తీరుస్తా ..ఒరే రెడ్డీ! ప్రయోగాలంటే, దెయ్యాల మంత్రగాళ్లు కిట్టనివాళ్లమీద తమ మంత్రశక్తిచేత దెయ్యాల్ని వొదిలి వాటిచేత బాధపెట్టిస్తామంటారు. పాపం—యీ బూటకపు ప్రయోగాల్ని నమ్మిన అమాయకులు, నిజంగా దెయ్యాలు బాధపెట్టినట్టే బాధపడతారు.'

అలా చెప్పడమే తడవుగా రెడ్డి 'ఓలమ్మో' అని లేచి తాత మెడ పట్టుగున్నాడు. అతడు విడిపించుకుని, వాడికి ధైర్యంచెప్పి కూచోబెట్టేడు 'ఎందుకురా అంత భయం! అసలు దెయ్యాలు లేవనే చెప్పానుగా! దానినిబట్టి ప్రయోగాలు బూటకమని తేలిందికదూ?'

'ఔనండి' అన్నాడు వణకుతూనే.

'అయితే యింకెందుకు భయం! ఇక కథవిను...జపం ముగించి వాడు వూరు తెల్లవారకుండా రోడ్డు కడ్డంగా వాలుకుర్చీమీద పండిలా పడుకొనేవాడు. అసలే మనవీధి యిరుకా! వాడు కూచుంటే యిక మనుష్యులు మెసలడమే కష్టంగా వుండేది. పైగా తెల్లవారిలేచి పళ్లు తోముకుందికి వీధిఅరుగుమీదకు రాగానే యమదూతలాగు వీడు హాజరు!

'వీడెలా కూచునేవాడో తెలుసా. ఈపక్కనో ముక్కాలిపీట, ఆ పక్కనో ముక్కాలిపీట. దీనిమీద తమలపాకులు, దానిమీద వక్కలు, యాలకులు, లవంగాలు వగైరా కాళ్లు జాపుకుందికి ముందరివైపు ఒకబల్ల. ఇలా శవంలా పడు



కుట్టుపని స్వబోధిని (తెలుగు)
"Self Tailoring and Cutting Teacher"
కొత్త పద్ధతిలో కత్తిరించి కుట్టు పాఠములు గలది. ప్రతి దర్జీవారికి, స్త్రీలకు ముఖ్యము. 82 పేజీలు 36 పటములుగల పుస్తకము అ. 12 పోస్టుఖర్చులు అ 5-మహరాజ పుస్తకశాల అరుణాచల మొదలి వీధి, 26 బీటు, మద్రాసు.



ఈ సొగసైన "ట్రై సైకిల్"-కు మీ ఆర్డర్లు పంపండి. ఇది ఉత్తమమైనది. కొత్తది ధరలు రు 25/-లు నుండి రు 15 లకు తగ్గింపబడినవి రైలుఖర్చి షుమారు 1/8/- వెంటనేఆర్డరిచ్చి మీ దగ్గరి రైల్వేస్టేషను వ్రాయండి
Midland Trading Co Ltd.,
P. Box 16605, Calcutta-4.

కుని, సావకాశంగా తాంబూలం వేసుగుంటూ, ఒచ్చీపోయేవారి వేపు చింతనిప్పుల్లాంటి కళ్లతో చూస్తూండేవాడు; యేడుగంటల యెండ వాడి మొహాన్న కరకర పొడిచేదాకా.'

'ఆడిని నరికేసేకపోయిన్రా!' అన్నాడు సుబ్బన్న

'ఎలాగ' ఎవడూ వాడిదగ్గరకెళ్లలేకపోయేవాడు. మీదకి దెయ్యాల్నొదిలేస్తాడేమోనని ప్రతివాడికీ భయం. పుదయాన్నే యేటికి, నీళ్లకోసం వెళ్లే పడుచుపిల్లల వేపు పని పెట్టుగుని పరకాయించి చూస్తూ 'దుర్గా!' అని, 'జగద్రక్షకే' అని 'లలితే' అని యేవో పేర్లుపెట్టి పిలుస్తూండేవాడు. చిన్నవాళ్లవడం చేత వాళ్లు జడుసుగునేవారు. బెంగ పెట్టుగుని వుష్ణంవస్తే, వీడే దెయ్యాం పట్టిందని పేర్లుపెట్టి హడలుకొట్టించి డబ్బు లాగేవాడు వాళ్ల వాళ్లదగ్గర నుంచి. వాడంటే పోస్టుమేష్టారికీ భయమే, అమీనుగారికీ, హెడ్ గుమాస్తాగారికీ అందరికీ భయమే.'

'మరి నీకో తాతా!' అన్నాడు వెంకిగాడు పెంకిగా.

'తాతకిమాత్రం దెయ్యంగం దట్టా! తాత మనిశా; మొగవాఁ?' అన్నాడు సుబ్బన్న.

'ఓరినాగమ్మా! నేను గాదురా మృగాన్ని. వాడురా - ఆ వీరప్ప రాజు! వాడి దెయ్యాలంటే నాకు భయంలేదు. వాడంటేనే. ఊర పందిలా వుండేవాడు. పైగా వాడి దగ్గర బారెడుకత్తి వోటివుండి యేడిసిందిగా! కాని యెలాగైనా వీడి భరతం పట్టాలని పట్టుదలపట్టాను.

'హెడ్ గుమాస్తాగారు వాడింటికెదురింట్లోనేగా వుండేవారు! ఓమారు వాడితో, నయాన్నే అన్నారు, 'పంతులుగారూ, మీరా వరండాలోనే కూచుంటే బాగుంటుందేమో. పొద్దున్నే మంచుకురుస్తూంటుందికదా' అని. వాడు మండిపడ్డాడు. 'భగవతి నన్నిక్కడే కూచోమంది, ఇది తప్పించగలిగేవాడు బ్రతికివున్నవాళ్లలో లేడు. నాయనా! నీకీ వుద్దేశం యేలకలిగింది? ఇది బాగుపడేవాళ్లకి కలగవలసిన సందేహంకాదే!' అన్నాడు. వీడి తాడు తెగ, వీడితో మనకెందుకని ఆయన వూరుకున్నారు.

తరవాత ఓనాటిరాత్రి అంతా పోస్టుమాస్టారింట్లో సమావేశమై యీ పీడని యెలా ఒదిలించుకోవడమని ఆలోచించాం. అంతా యేవేవో చెప్పేరేకాని, యెవరూ స్వయంగా ధైర్యంచేసే యేర్పాటులో లేరు. పోలీసువాళ్లకి కూడా భయమేగా దెయ్యాలంటే!

'అబ్బాయిలూ అప్పుడు నేనే తెగించేను. 'చూడండి, వీడిని యెల్లుండి మధ్యాహ్నానికి యిక్కడ నుంచి మకాం యెత్తిస్తా' నన్నాను. అంతా ఆశ్చర్యపోయేరు. 'ఎలాగరా సుబ్బులు' అన్నారు నన్ను చుట్టేసి. 'ఇప్పుడేం చెప్పను; చూదురుగాని నా మజా' అని వెళ్లిపోయేను. నే నన్నట్టే ఆ వీరప్ప రాజులు దెయ్యాలపంతులుగాడు ఆ యెల్లుండివుదయం పదిగంటలకు డబ్బాడవాలుతోసహా యీ వూరి నుంచి దయచేసేడు. కథ కంచికి మనం యింటికీ, పొండి-' అన్నాడు సుబ్బులుతాత; పైబట్ట దులుపుకొంటూ.

పిల్లలంతా గొల్లుమన్నారు. 'మాకంతా చెప్పతాతా! నువ్వేం చేసేవో చెప్పాల్సిందే' అన్నారు గోలపెడుతూ.

'నే నొక్కడినీ యేంచెయ్యగలన్రా! మీలాంటి మరిద్దరి సాయంతో వాడిని పూరీబైటకు గెంటేశాను'

సుబ్బన్న చెవులు చాటలంతేసి అయేయి. 'ఏటేటి తాతోయ్! నాలాంటివోళ్లే! సెప్పతాతా-ఆళ్లు నానాగున్నారా?'

'చెప్పేనుగదరా. అచ్చంగా నీలాగే: రెండు అడ్డగాడిదలు.'

'గాడిదలా!!' అంతా ఆశ్చర్యపోయేరు.

'ఔన్రా! ఆ మర్నాడుదయాన్నే రెండు బలమైన గాడిదల్ని పట్టి, వీధికొసనున్న బడిపెరట్లో కట్టేసేను. వాటికి తిండిపెట్టలేదు. రెంకుఝామదుసార్లు వెళ్ళి చితకతన్నేను. ఆరాత్రి మరోసారి వెళ్ళి తన్నేను. అప్పుడవి యెలావున్నాయంటే, ఒదిలేస్తే మెరుపుల్లా దౌడు తీసెయ్యటానికి సిద్ధంగా వున్నాయి.

'మర్నాడుదయం ఐదుగంటలకు యేట్లోస్నానంచేసి, ప్రత్యేకంగా వీరప్పరాజు దెయ్యం రోడ్డుకడ్డంగా కూచున్న స్థలంమీదుగా వెళ్లి, వాడున్నదీ లేనిదీ చూసుగుని నమస్కారంచేసేను. వాడు గర్వంగా నన్ను దీవించేడు; 'భగవతి నిన్ను రక్షిస్తుందిరా!' అని. నాలో నేననుకున్నా 'గాడిదలు నీ పని పట్టిస్తాయిరా' అని.

'అబ్బాయిలూ. ఇక కథ జాగ్రత్తగా వినండి. మజా అంతా యిక్కడే వుంది. తొలినాడు రాత్రే పొడుగాటి ఆరు కొబ్బరిమట్టలు సంపాదించేను. మూడేసి కలిపి ముక్కోణాకారంగాకట్టి, కొసువేపు తాడుతో గట్టిగా గాడిదల తోకలకి కట్టేశాను. ఈపనిచెయ్యడానికి మరి నలుగురిసాయం తీసుకున్నాలెండి. అర్థంలేనికథ అనుకొని మీలో గడుసుకుంకలు కొట్టిపారేస్తారేమో!

'అలాకట్టి ఆ రెండుగాడిదల్నీ దెయ్యాలపంతులింటి ముఖంగా వదిలాను.

'అడ్డంగావున్న కొబ్బరిమట్టలు రోడ్డుకీపక్కా ఆ పక్కా తగులుతున్నాయి. వాటికి దిట్టంగా బ్రహ్మజెముడుపట్టలు తుమ్మముళ్ళ, డొంకలు నిండా కట్టించేను. ఇంకా మసకమసక వెలుతురుగావున్న ఆ వుదయంవేళ కోపంతో మండిపోతూన్న ఆ రెండుగాడిదల వీపుల మీదా దుడ్డుకఱ్ఱలతో చెరోటి ఒడ్డించి ఒదిలేసత్తా. ఇక చూసుకోండి. అవి పురకలేస్తూ 'ఓ! ఓ! ఓ!...' అని ఓండ్రపెడుతూ, తోకలకున్నవాటికి మరీ బెదిరి, ఫెడీఫెడీమని తన్నుకొంటూ దౌడు లంకించుకున్నాయి.

'అప్పుడు మన దెయ్యాలపంతులు యీ పక్కనొక బల్ల, ఆ పక్కనొకబల్ల, కాళ్లముందొక బల్ల వేసుగుని హాయిగా తాంబూలం సేవిస్తున్నాడుకదూ! ఈ గాడిదలు, అరుస్తూ కరుస్తూ, నురగలతో పురకలతో, ఊపులతో తాపులతో, పంతులు వున్నవైపే బ్రహ్మప్రళయంలా వస్తూన్నాయి. బల్లలమధ్య టిక్కడిపోయిన పంతులుకి మతిపోయింది. 'టకటక,' 'ధనాధన్,' ఒక గాడిద పంతులుమీంచి యెగిరి చెంపమీద ఫెడీమని తన్నింది. వెనువెంటనే రెండోదొచ్చి పంతులు మీద నాలుగుకాళ్లతో కూలిపోయింది. అది మరీ బెదిరి, అతన్ని ఫెడీఫెడీమని వరసగా తన్ని పరుగు లంకించుకున్నాయి. తిరిగి పంతులు ముక్కోణపు ముళ్లకంచెలమధ్య యిరుక్కున్నాడు. కాని ఆ జంతువు లాగుతాయా! అతడిని బరబరా యీడ్చుకు పరుగెత్తజొచ్చేయి. ఆ జుజ్జుమధ్య చిక్కుకుని, యీండ్రడిగిలబడుతూ, ముళ్లపోటులు, గాడిదెల తాపులు తింటూ పంతులు డొల్లి డొల్లి చివరకి సైదుకాలవలో పడ్డాడు. ఈ ఆర్భాటానికి యిళ్లలో పడుకున్నవారందరూ లేచివచ్చేరు.

'ఎనిమిదిగంటలకు దెయ్యాలపంతుల్ని ఆస్పత్రిలో చేర్చేరు. నేను వెళ్లిచూసి విచారం నటిస్తూ 'భగవతి మిమ్ముల్ను రక్షించుగాక' అన్నాను. ఆనాడు పదింటికే అతడిని విజయనగరం ఆస్పత్రికి మోసుకుపోయేరు. నాటికీ నేటికీ పంతులు ఫకరు లేదు. కథ యిప్పుడు కంచికి మనం యిక యింటికి' అని ముగించేడు సుబ్బులుతాత.

పిల్లలు డొల్లిడొల్లి నవ్వేరు.

★

చదవండి / తెనుగు మాస పత్రిక
జయభారత్